క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండాలి

ధర్మారం: సైబర్ నేరగాళ్ల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ధర్మారం ఎస్సై సత్యనారాయణ కోరారు. నందిమేడారం గ్రామానికి చెందిన సందనవేని పవన్‌కుమార్ యాదవ్‌కు సంబంధించిన బ్యాంక్ అకౌంట్ నుంచి తెలియకుండానే ఆధార్ ఎనాబిల్ పేమెంట్ సిస్టం ద్వారా రూ.10వేలు సైబర్ నేరగాళ్లు విత్‌డ్రా చేశారన్నారు. పవన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



పనులు ప్రారంభించిన శరణ్య

రామగుండం: అంతర్గాం మండలం పెద్దంపేట గ్రామంలో సోమవారం ఎంపీటీసీ కొలిపాక శరణ్య రూ.2లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ నిధులతో సీసీ రోడ్డు, డ్రైయినేజీ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకుడు కొలిపాక మధుకర్‌రెడ్డి, గ్రామ అధ్యక్షుడు పుట్ట శ్రీనివాస్ యాదవ్, గుజ్జుల రమణారెడ్డి, మేర్గు రమేశ్‌గౌడ్, బండి వీరయ్యగౌడ్, నేరెళ్ళ కొమురయ్యగౌడ్, లైశెట్టి రవి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



జూలపల్లి ఎస్సైగా విధుల్లో చేరిన శ్రీధర్

జూలపల్లి: పొత్కపల్లిలో ఎస్సైగా పని చేసిన ఎస్.శ్రీధర్‌ను జూలపల్లికి బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు విడుదల చేయగా.. సోమవారం జూలపల్లి ఎస్సైగా విధుల్లో చేరారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

ఓదెల: నాంసానిపల్లెలో పని చేసి పొత్కపల్లికి బదిలీ అయిన ప్రధానోపాధ్యాయుడు అమృత కిషోర్‌ను ఓదెల ఎంఈవో అరెపల్లి రాజన్న, ఓదెల ఎంపీపీ కునారపు రేణుకదేవి సోమవారం ఘనంగా సన్మానించారు.

ఎంపీడీవోకు..

ఎలిగేడు: ఎలిగేడు ఎంపీడీవో శ్రీనివాసమూర్తి బదిలీ కాగా.. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయనకు సన్మానం చేశారు. పూలమాలలు, శాలువాలతో ఎంపీపీ తానిపర్తి స్రవంతి, అధికారులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. తానిపర్తి మోహన్‌రావు, భూర్ల వెంకటసత్యం, వివిధ శాఖల అధికారులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముత్తారం: రాజన్న సిరిసిల్ల జిల్లాకు బదిలీ అయిన ముత్తారం ఎంపీడీవో కలికోట శ్రీనివాస్‌ను ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ జక్కుల ముత్తయ్యపటేల్, జెడ్పీటీసీ చెలుకల స్వర్ణలతఅశోక్, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు సన్మానించారు. ఎంపీవో వేణుమాధవ్, మండల పరిషత్ సిబ్బంది, వైస్ ఎంపీపీ రవీందర్‌రావు, నూనె కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అవగాహన



గంగారంలో పనులు పరిశీలిస్తున్న తహసీల్దార్

కాల్వశ్రీరాంపూర్: ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా గంగారం గ్రామంలో సోమవారం అధికారులు పారిశుధ్య కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పేపర్లు, ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలు, డిస్పోజల్ గ్లాసులు, పేపరు ప్లేట్లు, టీకప్పులు, కూల్‌డ్రింక్ సీసాలు ఇంటిముందు డ్రైయినేజీలో వేయడంతో దోమలు వృద్ధి చెంది జ్వరాలు, వ్యాధులు దాడి చేస్తాయన్నారు. బోరింగుల చుట్టూ పేరుకుపోయిన చెత్త, ఖాళీ స్థలాల్లో ఏపుగా పెరిగిన ముళ్ల పొదలను తొలగించారు. తహసీల్దార్ జాహెద్‌పాషా, ఎంపీడీవో రామ్మోహనాచారి, ఎంపీవో గోవర్ధన్, కార్యదర్శులు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

భూమి ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

కాల్వశ్రీరాంపూర్: పందిల్ల గ్రామంలో గ్రామానికి చెందిన కె.కుమార్ అనే వ్యక్తి ప్రభుత్వ భూమిని అక్రమ పట్టా చేయించుకున్నాడని తాజా మాజీ సర్పంచ్ దాసరి లావణ్య, గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ జాహెద్ పాషాకు ఫిర్యాదు చేశారు. సర్వే నెంబరు 805/3లో 4.20ఎకరాల ప్రభుత్వ భూమిని, మరికొంత తన బంధువుల పేరు మీద అక్రమ పట్టా చేయించుకున్నాడని వాపోయారు. ఉన్నతాధికారులకు నివేదించి వారి ఆదేశానుసారం చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు. రమేష్, గంగదరి అనసూర్య, చిలుముల పైడయ్య, ఈర్ల రాజేశ్, ఎం.రజిత, లక్ష్మయ్య, రాజయ్య, అబ్బుల్ల, పున్నలత, మురళి, రాజమ్మ, సదయ్య ఉన్నారు.

భక్త మార్కండేయ జయంతి



పెద్దబొంకూర్‌లో..



రొంపికుంటలో నివాళి అర్పిస్తున్న నాయకులు



ఎలిగేడులో..

పెద్దపల్లిరూరల్/ధర్మారం/ఓదెల/కాల్వశ్రీరాంపూర్/ఎలిగేడు/యైటింక్లయిన్‌కాలనీ/సుల్తానాబాద్/జూలపల్లి/కమాన్‌పూర్: జిల్లాలో భక్త మార్కండేయ జయంతి ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. మర్కండేయ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. పద్మశాలీ సేవాసంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కాల్వశ్రీరాంపూర్‌లో..



జూలపల్లిలో..



ఓదెలలో..



పేరు మారిన ఆయుష్మాన్ భారత్

సుల్తానాబాద్: కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ కోసం పల్లె దవాఖానలను ఏర్పాటు చేసింది. అందులో డాక్టర్, స్టాఫ్ నర్స్, ఏఎన్ఎం, ఆశ కార్యకర్త అందుబాటులో ఉంటారు. గ్రామీణ ప్రాంతాల్లో రోగులకు ఉదయం నుంచి సాయంత్రం వరకు సేవలందిస్తారు. గతంలో పల్లె దవాఖాన ఆయుష్మాన్ భారత్ పేరున కొనసాగించేది. కాగా ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌గా పేరు మార్చిందని వైద్యులు తెలిపారు.

అయోధ్యకు తరలిన బీజేపీ నాయకులు

ఓదెల: ఓదెల, మడక, గుంపుల గ్రామాల నుంచి బీజేపీ నాయకులు బాలరాముడి దర్శనం కోసం అయోధ్యకు సోమవారం తరలివెళ్లారు. ప్రత్యేక వాహనంలో తరలివెళ్లిన వారిలో తీర్థాల కుమార్, డాక్టర్ ఎంబాడి మల్లేశ్, దాత రాకేశ్, రాంనేని రాంజేంద్రప్రసాద్, సక్కినాల కృష్ణ, ఆవుల ఉమాశంకర్, మేకల రవి, రాంనిరేని శివ ఉన్నారు.

జాతరకు ముమ్మర ఏర్పాట్లు

సుల్తానాబాద్‌రూరల్: గర్రెపల్లి గ్రామంలోని సమ్మక్క–సారలమ్మ జాతర కోసం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. గద్దెలకు రంగులు వేయడంతో పాటు చుట్టూ సున్నం వేస్తున్నారు. భక్తుల కోసం చలువ పందిళ్లు, స్నానాల ఘట్టాలు ఏర్పాటు చేశారు. భక్తుల బస కోసం జాతర ప్రాంతాన్ని చదును చేసినట్లు సభ్యులు తెలిపారు.

ఎన్నిక..

ఎలిగేడు: లాలపల్లి–ఎలిగేడు గ్రామాల మధ్యనున్న పెండ్లిపోరుగుట్ట వద్ద జరిగే శ్రీసమ్మక్క–సారలమ్మ జాతర ఉత్సవ కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా సింగిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా కవ్వంపల్లి స్వామి, ప్రధాన కార్యదర్శిగా అమ్ముల కుమారస్వామి, కోశాధికారిగా భూర్ల సత్యనారాయణ ఎన్నికయ్యారు. జాతర వద్ద దుకాణాలను ఏర్పాటు చేసేందుకు వేలంపాట నిర్వహించారు. కూల్‌డ్రింక్ దుకాణం రూ.2,100, కొబ్బరికాయల దుకాణం రూ.6,100, మద్యం దుకాణం రూ.10,500, కోళ్లు అమ్ముకునేందుకు రూ.5,000 పాడి పలువురు దక్కించుకున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ తెలిపారు.



గర్రెపల్లిలో గోడలకు సున్నం వేస్తూ..

ఆధ్యాత్మికం

మల్లికార్జునస్వామి ఆలయంలో పూజలు



జూలపల్లి: యాదవ సంఘం ఆధ్వర్యంలో పెద్దాపూర్‌లోని శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో సోమవారం ధ్వజ స్తంభ, నందీశ్వర శిఖర స్థాపన, నవగ్రహ పూజ, రుద్ర హోమం నిర్వహించారు. ఆలయ పూజారులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అఖిల భారత యాదవ మహాసభ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సందవేని రాజేందర్‌యాదవ్, ఉమ్మడి జిల్లా షీప్ ఫెడరేషన్ చైర్మన్ తమ్మడవేని ఓదెలుయాదవ్, మాజీ సర్పంచ్, మండల మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు దానవేని నర్సింహయాదవ్ పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. దాడి నాగరాజు, నరేష్, మల్లేశ్, కొమ్ము పోచాలు పాల్గొన్నారు.

శివాలయంలో రుద్రాభిషేకం



సుల్తానాబాద్: మాఘ మాసం సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని శివాలయంలో స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. నీరుకుల్ల వాస్తవ్యులు, తాజా మాజీ సర్పంచ్ కోటగిరి విజేందర్–లత, గోపగాని రాజయ్య, పద్మ, రేగొండ సుధాకర్–విజయ ప్రత్యేక పూజలు చేశారు. పలు రకాల పండ్లతో రుద్రాభిషేకం నిర్వహించారు. పూజారి మహేశ్ తీర్థప్రసాదాలను అందజేశారు. కమిటీ చైర్మన్ సత్యనారాయణ తదితరులున్నారు.

నేత్రదాత కుటుంబానికి అభినందన

యైటింక్లయిన్‌కాలనీ: కమాన్‌పూర్ గ్రామానికి చెందిన కోటగిరి రాజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా.. ఆయన కుటుంబ సభ్యులు నేత్రదానం చేశారు. సోమవారం సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్రదాత సంస్మరణ సభను నిర్వహించారు. నేత్రదాత కుటుంబ సభ్యులకు ఫౌండేషన్ ప్రతినిధులు అభినందన పత్రం అందజేశారు. ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి నేత్ర, శరీర అవయవ దానాలపై అవగాహన కల్పించారు. నరసింహాచారి, రామకృష్ణారెడ్డి, శంకర్, శ్రవణ్‌కుమార్, రమేశ్, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

గోలివాడ జాతరకు 42 ఏళ్లు

- 40 ఎకరాల్లో భక్తులకు మెరుగైన సౌకర్యాలు

రామగుండం: ఆహ్లాదకరమైన వాతావరణం.. సేదతీరేందుకు పచ్చని చెట్లు.. స్వచ్ఛమైన గాలి.. కనువిందు చేసే దృశ్యాలు.. మెరుగైన రోడ్డు, రైలు రవాణా సౌకర్యాలు.. గోదావరినది తీర ప్రాంతంలో కొలువైన ప్రాంతం.. వీటన్నింటి విశిష్టత రూపమే గోలివాడ సమ్మక్క–సారలమ్మ జాతర. గోలివాడ జాతరకు ప్రస్తుత ఏడాదితో 42 ఏళ్లు పూర్తయ్యాయి.

గోదావరి ఒడ్డున..

గోలివాడ గ్రామంలో జాలిగామ కిషన్‌రావు అలియాస్ బయ్యాజీ అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు నివసించేవాడు. గోదావరినదిలో స్నానమాచరించేందుకు వెళ్లిన క్రమంలో గోదావరి ఒడ్డున ఇసుక కుప్పలో ఎరుపు బట్టలో కుంకుమ భరణి మూట లభ్యమైంది. స్నానమాచరించిన తర్వాత కుంకుమ భరణితో ఇంటికి వచ్చిన బయ్యాజీ రాత్రి నిద్రించాడు. నీకు లభ్యమైన కుంకుమ భరణి స్థానంలో శ్రీసమ్మక్క–సారలమ్మ, పగిడిద్దరాజు గద్దెలు నిర్మించి ప్రతీ రెండేళ్లకోసారి జాతర నిర్వహించాలని ఆదేశించినట్లు దేవతల ప్రతిరూపాలతో కల వచ్చిందన్నారు. ఇదే విషయాన్ని బయ్యాజీ గ్రామంలోని పెద్ద మనుషులు ఆవుల చంద్రయ్య, పెంద్రు హన్మాన్‌రెడ్డికి తెలపగా.. అందరు కలిసి మరోమారు గోదావరినది ఒడ్డుకు వెళ్లి పరిశీలించారు. కుంకుమ భరణి ముల్లె లభ్యమైన ప్రాంతంలో పూజా సామగ్రి కనిపించింది. అదే ఏడాది 1982లో గోదావరినది ఒడ్డున వన దేవతల గద్దెలను నిర్మించి జాతరను ప్రారంభించారు. 42 ఏళ్లుగా గ్రామానికి చెందిన 41 మందితో వ్యవస్థాపక కమిటీ ఏర్పాటు చేసి జాతర నిర్వహిస్తున్నారు.

భక్తుల తాకిడి ఎక్కువ..

గోదావరినది ఒడ్డున వన దేవతలు ప్రత్యక్షంగా తిష్ట వేసినట్లు చరిత్ర ఉండడంతో.. దర్శనానికి భక్తులు ఎక్కువగా మొగ్గు చూపిస్తుంటారు. ముఖ్యంగా పూనకం వచ్చే భక్తుల తాకిడి మరీ ఎక్కువగా ఉంటుంది. ప్రధానంగా పెద్దపల్లి, మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలతో పాటు మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుండడం ఆనవాయితీగా వస్తోంది. ప్రస్తుతం గోదావరినదిలో బ్యాక్ వాటర్ లేకపోవడంతో వరద నీరు లేక ఇసుక తిన్నెలు దర్శనమిస్తుండడంతో.. నడిచి వెళ్లేందుకు మంచిర్యాల జిల్లాకు వెళ్లేందుకు సౌకర్యంగా మారింది. ఫలితంగా భక్తుల తాకిడి గత జాతరతో పోల్చితే నాలుగు రెట్లు అధికంగా ఉండనుందని భావించి చిరు వ్యాపారులు వేలం పాటలో అత్యధిక పాటకు దక్కించుకోవడం గమనార్హం.

బోర్ల తవ్వకం..

నాలుగు రోజుల పాటు జరిగే జాతర సందర్భంగా భక్తుల సౌకర్యార్థం జాతర ప్రాంగణంలో ప్రత్యేక బోర్లు తవ్వించారు. విద్యుత్ సరఫరాకు విద్యుత్ శాఖ ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసింది. గోదావరినది నీటిని కేవలం స్నానాలకే పరిమితం చేశారు. గోలివాడ జాతరలో నలువైపులా బోర్లు, స్నానాలు చేసేందుకు షవర్స్, ప్రత్యేక టాయిలెట్స్, జాతర ప్రాంగణంలోని కూడళ్లలో సెంట్రల్ లైటింగ్స్, జాతరలో 200 అంతర్గత వీధి దీపాలు, పొరుగు ప్రాంతాల నుంచి భక్తులు వచ్చేందుకు రైల్వేట్రాక్ వరకు రహదారి ఏర్పాట్లు చేశారు.



వన దేవతల గద్దెలు

ఎన్టీపీసీ సహకరించింది



రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ సహకారంతో గోలివాడ జాతరకు ఎన్టీపీసీ రూ.30లక్షలు కేటాయించింది. ప్రస్తుతం గోదావరిలో కాళేశ్వరం బ్యాక్ వాటర్ లేకపోవడంతో పొరుగు జిల్లాల నుంచి భక్తుల తాకిడి అధికంగా ఉండనుంది. కాళేశ్వరం బ్యాక్ వాటర్ లేని 2018లో జాతరకు ఐదు లక్షల మంది భక్తులు రాగా.. ప్రస్తుతం అంతే మొత్తంలో భక్తులు వచ్చే అవకాశముంది. ఎన్టీపీసీ సంస్థ మరో రూ.30లక్షలు కేటాయిస్తే భక్తుల సంఖ్యకు సరిపడా అభివృద్ధి పనులు చేసుకునే వీలుంటుంది.

– పెంద్రు హన్మాన్‌రెడ్డి, జాతర కమిటీ చైర్మన్

జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారని ఐపీఎస్ డైరెక్టర్ కృష్ణప్రియ తెలిపారు. సోమవారం ఐపీఎస్ పాఠశాల డైరెక్టర్ మాటేటి సంజీవ్‌కుమార్, కృష్ణప్రియ విద్యార్థులను అభినందించారు. ఈనెల 11న వరంగల్ జిల్లా నర్సంపేటలో షోటోకాన్ జపాన్ కరాటే–డూ ఇండియా హోంబు ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో జి.హర్షవర్ధన్ కటా 12 సంవత్సరాల విభాగంలో బంగారు పతకం, కుంత్ విభాగంలో బంగారు పతకం సాధించాడు. కరీంనగర్ జిల్లాలో జరిగిన ఇండో–నేపాల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో కటా 9 సంవత్సరాల విభాగంలో జి.రిషివర్ధన్ బంగారు పతకం సాధించాడు.



విద్యార్థులను అభినందిస్తున్న కృష్ణప్రియ

జ్యోతినగర్: వరంగల్ జిల్లా నర్సంపేటలోని పద్మశాలీ గార్డెన్‌లో నిర్వహించిన నేషనల్ కరాటే చాంపియన్‌షిప్–24 షోటోఖాన్ జపాన్ కరాటే డు ఇండియా హంబో టోర్నమెంట్‌లో ఎన్టీపీసీ రామగుండం ప్రాంతం విద్యార్థులు పాల్గొని ప్రతిభ ప్రదర్శించి పతకాలను సాధించారు. కటాస్, కుమితి విభాగాల్లో రామగుండానికి చెందిన జపాన్ షిటోరియో కరాటే స్కూల్ విద్యార్థులు బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందిస్తున్న సచ్‌దేవ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

జ్యోతినగర్: దివ్యాంగులకు సచ్‌దేవ స్కూల్ ఎక్స్‌లెన్స్ అండగా ఉందని ప్రిన్సిపాల్ జ్ఞాన్‌చంద్ అన్నారు. టెంపరరీ టౌన్‌షిప్‌లోని సచ్‌దేవ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ విద్యార్థులు తమ పూర్తిస్థాయి సహకారమందించారని తెలిపారు. సచ్‌దేవ్ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో స్నేహ సంస్థ ఆధ్వర్యంలో సొసైటీ ఫర్ నార్మేటివ్ ఎడ్యుకేషన్ త్రూ హ్యూమన్ అసోసియేషన్–విజయవాడ వారు అంధులకు సహాయార్థంగా ఆటాపాట నిర్వహించగా.. విద్యార్థులు సరదాగా గడిపారని అన్నారు. విద్యార్థులు జమ చేసిన రూ.1,53,652 సంస్థకు అందించారు.

నిరుపేద కుటుంబానికి చేయూత

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్‌లోని నిరుపేద పారుపెల్లి లక్ష్మణ్ కుటుంబానికి అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ జిల్లా ప్రచార కార్యదర్శి జూల లింగయ్య నిత్యావసరాలను అందజేశారు. గంగారపు తిరుపతి, కావ్య, దళిత రత్న దేవి లక్ష్మినర్సయ్య, పెసరు శంకర్, యాదండ్ల రాజు, పెసర సురేష్, గాలెంకి ప్రసాద్ తదితరులున్నారు.

కార్యవర్గం ఎన్నిక

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి వ్యాన్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఖరారైంది. అధ్యక్షుడిగా బూత్కూరి తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా ఆరీఫ్‌అలీ, ఉపాధ్యక్షుడిగా రాజబాబు, కార్యదర్శిగా సది, కోశాధికారిగా అరుణ్ ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షులుగా సయ్యద్ మస్రత్, లీగల్ అడ్వయిజర్‌గా ఉప్పు రాజు, ముఖ్య సలహాదారుగా రాయమల్లు వ్యవహరిస్తారు.



కంటి వైద్యశిబిరానికి స్పందన

సుల్తానాబాద్: పట్టణంలోని శ్రీవాణి డిగ్రీ కళాశాలలో ఉచిత కంటి వైద్యశిబిరానికి స్పందన లభించింది. సోమవారం లయన్స్ క్లబ్, రేకుర్తి కంటి ఆస్పత్రి సంయుక్తంగా నిర్వహించిన కంటి వైద్యశిబిరంలో 150 మందికి పరీక్షలు చేయగా.. 18 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించామని డాక్టర్ ప్రభాకర్ తెలిపారు. ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు చెప్పారు. కంటి ఆసుపత్రికి శస్త్ర చికిత్సల కోసం 18 మందిని సిఫార్సు చేశామని వివరించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నోముల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అదనపు కార్యదర్శి వలస నీలయ్య, జిల్లా కోఆర్డినేటర్ మాటేటి శ్రీనివాస్, పిట్టల వెంకటేశం, ప్రభాకర్, కళాశాల ప్రిన్సిపాల్ బండారి కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మారం: నందిమేడారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుష్మిత ఆధ్వర్యంలో ఆరు గ్రామాల్లో అసంక్రమిత వ్యాధులపై హెల్త్ క్యాంపు నిర్వహించారు. కల్లెంరెడ్డిపల్లి, న్యూకొత్తపల్లి, నాయకంపల్లి, కటికెనపల్లి, మేడారం, చింతలపల్లి గ్రామాల్లో బీపీ, షుగర్, టీబీ, క్యాన్సర్‌తో పాటు జ్వరపీడితుల రక్త నమూనాలను సేకరించారు. ఎర్రగుంటపల్లి గ్రామంలోని బ్రిక్స్‌లైన్ ఏరియాలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ధర్మారంలో నీటి ట్యాంక్‌లో నీటి క్లోరినేషన్ టెస్టును ప్రత్యేకాధికారి, ఏఈ, డీఈఈ సమక్షంలో నిర్వహించారు. డాక్టర్ గౌతం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సుల్తానాబాద్‌లో పరీక్షలు చేస్తున్న డాక్టర్

క్రీడారత్న అవార్డు అందుకున్న శాంత

జ్యోతినగర్: క్రీడారత్న జాతీయ అవార్డును జాగటి శాంత అందుకున్నారు. న్యూఢిల్లీలో బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో ఎన్టీపీసీ రామగుండం ప్రాంతానికి చెందిన జాగటి శాంతకు అవార్డును సౌత్ ఇండియా జనరల్ సెక్రటరీ విష్ణువర్ధన్, గౌతమ్, బాదె వెంకటేశం, అయిలయ్య చేతుల మీదుగా అందజేశారు.

గ్రామీణ భారత్ బంద్ విజయవంతం చేయాలి

కాల్వశ్రీరాంపూర్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ఉద్యోగ, ప్రజావ్యతిరేక విధానాలు ఖండిస్తూ ఈనెల 16న సీఐటీయూ నేతృత్వంలో సమ్మె కార్యక్రమం, గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మంద రాజేందర్, సీఐటీయూ మండల అధ్యక్షుడు అంబాల లక్ష్మణ్ పిలుపునిచ్చారు. కాల్వశ్రీరాంపూర్‌లో సోమవారం వాల్ పోస్టర్ విడుదల చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీవో గోవర్ధన్‌కు సమ్మె నోటీస్ అందించారు.

సంకెళ్ల నుంచి విముక్తి కలిగిన దినం జనవరి 22

రామగుండం: జనవరి 22 సంకెళ్ల నుంచి విముక్తి కలిగిన దినంగా ప్రపంచ దేశాలు గుర్తించాయని, 530 ఏళ్ల క్రితం ఉన్న రామాలయాన్ని ధ్వంసం చేసి అదే స్థానంలో మసీదును నిర్మాణం చేయడంతో 21సార్లు కరసేవ యుద్ధం చేసి రామమందిర విముక్తి కోసం పోరాటం సాగించారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌రావు అన్నారు. సోమవారం రాత్రి అయోధ్య ప్రత్యేక(ఆస్థా) రైలులో వెళ్లే భక్తులకు కాషాయ జెండా ఊపి వీడ్కోలు పలికి మాట్లాడారు.

అర్హులకు న్యాయం చేయాలి

గోదావరిఖనిటౌన్: గురుకుల అభ్యర్థులు కొంతకాలంగా ఎదురుచూస్తున్నారని, ఎంపికయిన అభ్యర్థులను గురుకులం బోర్డు ఆరోహణ పద్ధతిలో ఎంపిక చేయకుండా అన్యాయం చేస్తోందని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. ఈనెల 14న ఎల్‌బీ స్టేడియంలో సీఎం చేతుల మీదుగా ఎంపికయిన ఉద్యోగులకు నియామక పత్రాలు అందజేసే ఉద్దేశంతో గురుకులం బోర్డు ఆగమేఘాల మీద అభ్యర్థులను ఎంపిక చేస్తోందన్నారు.